# దేశసేవకుడు

ఎక్స్‌ప్రెస్ బస్ ఫుట్‌బోర్డు మీద నుంచున్నారు శ్రీ శివరావుగారు. ఆయన్ని పుష్పాలంకృతుల్ని చేసి సాగనంపడానికి వొచ్చిన జనం 'స్వతంత్రభారత్‌కీ జై' అని జయజయ ధ్వానాలు చేస్తున్నారు. శివరావుగారు బస్సు కదిలేముందు 'జైహింద్' అని మూడుసార్లు అరిచారు. అందరూ ప్రతిధ్వనించారు తిరిగి ఆ మాటని.

డ్రైవరు దీనితో తనకేం సంబంధం లేనట్టు బస్సు పోనిచ్చాడు. కండక్టరు కొట్టిన గంట విని కండక్టరూ మిగతా వాళ్ళూ బస్సు పట్టుకొని వేళ్ళాడుతున్నారు. కొన్ని నిమిషాలయ్యాక కండక్టరు శివరావుగారితో "అందర్ చలియే, సాబ్" అన్నాడు.

ఆయన కళ్ళల్లో ఆనందబాష్పాలు నిండి అలాగే నుంచుండిపోయిన మనిషి, స్పృహకలిగి లోపలికి వచ్చారు. అప్పటికే బస్సు నిండిపోయింది. ఒక పెద్దమనిషి తను కూచున్నచోటు నుండి లేచి, "ఇక్కడ కూచోండి సార్" అన్నాడు. శివరావుగారు అనుమానించారు. కాని ఆయన నిలుచుండడానికే నిశ్చయించినట్టు తెల్సుకున్నాక మెల్లగా వెళ్ళి అక్కడ కూచున్నాడు.

జేబులో రుమాలు తీసి ఆనందబాష్పాల్ని అద్దుకున్నారు. అది ఎలా వచ్చిందో ఆయనకి తెలీదు. కాని ఏ సంతోషకరమైన కార్యక్రమం కొనసాగిస్తున్నా ఆయన నేత్రాలు ఆనంద బాష్పాల్తో నిండుతాయి. కావాలనుకున్నా ఆయన ఆపుకోలేరు. అది ఆయన స్వభావమో లేక అందరూ అంతేనేమో!

మెళ్ళో పువ్వులను తీసి చేత్తో పట్టుకున్నారు. తెల్లని ఖద్దరు లాల్చీ, ఖద్దరు పంచీ, పైన మడత పెట్టబడిన కండువా, లాల్చీ కొన్నిచోట్ల చినగడం వల్ల. 'రఫ్' చెయ్యబడి వుంది.

శ్రీ శివరావు గార్ని ఎరగనివాళ్ళెవరూ వుండరు. ఆయన దేశం కోసం చేసిన త్యాగం అతీతం. ఆయన మేధస్సు అనంతం. ఆయన ప్రజాసేవాభిలాష అద్వితీయం! మనిషి అజానుబాహుడు: వేదిక మీదికి రాగానే ప్రజలు నిశ్శబ్దానికి దాసులవుతారు. ఆయన ఉపన్యాసాలు ఉపన్యాసాలు కాదు. అది ఒక భాషా ప్రవాహమే. దానిలో ప్రజల భావాల ప్రతిబింబాలు మిగులుతాయి. తను ఉద్రేకపడకుండా ప్రజల ఉద్రేకాన్ని రెచ్చకొట్టగలడు. నిలువరించగలడు. ఆయన గొప్ప అక్కడే ఉంది!

బస్సు చిన్ని గ్రామాల్లో ఎక్కడా ఆగకుండా వేగంగా పోతోంది. అక్కడక్కడ అడ్డువచ్చే జనబండ్లని, బస్సులీ్న డ్రైవరు చాకచక్యంతో తప్పిస్తున్నాడు. కొండలూ, మిట్ట పల్లాలూ వెళుతు పరుగెడుతున్నాయి. గాలి అంత వేగంతో బస్సులోకి చొచ్చుకొచ్చి, అందులో కొట్టుకొని, తిరిగి బయటకు పోతోంది, ఉక్కిరిబిక్కిరై, మీరెప్పుడన్నా గమనించారో లేదో గాని తెలంగాణాలో వున్న గొప్పతనమే అది! ప్రకృతి దృశ్యాల సౌందర్యాల్ని భూమి యొక్క ఎగుడు దిగుడులే ద్విగుణీకృతం చేస్తాయి.

కాని శివరావుగారు ఇవేమీ చూడడం లేదు. సాధారణంగా ఆయన దృక్పథంలో ఇలా భౌతిక విషయాలు పడవు. ఆయన ఎప్పుడూ దేశ సౌభాగ్యాన్ని గురించే ఆలోచిస్తారు. దేశాభ్యుదయం ఆయన జీవితలక్ష్యం.

హైదరాబాద్‌లో రాబోయే కొద్ది రోజుల్లో సాంఘిక సేవా సమితి సమావేశం జరుగబోతూ ఉంది. దానికి దేశంలోని స్వార్థ త్యాగులందరూ ఆహ్వానించబడ్డారు. దానికి మత, రాజకీయ సంబంధం లేదు. స్వార్థరహితమైన ప్రజాసేవే దాని లక్ష్యం అదే శివరావుగారి వైఫల్యం కూడాను దానికోసమే ఆయన ఇన్నాళ్ళు శ్రమ పడ్డారు. అలాంటి దేశభక్తులందరూ కొద్ది రోజుల్లో కల్సుకుని ఓ నిర్ణీత కార్యక్రమానికి వస్తారు. దేశసేవ, దేశాభ్యుదయం, స్వార్థత్యాగ, సౌభ్రాతృత్వం, సమానత్వం అనేవే ఆయన తలలో మెదులుతూ వుంటాయి. దానికే ఆయన సర్వశక్తులూ వినియోగించారు. ఇంకా వినియోగిస్తూనే ఉన్నారు. ముందుకూడా వినియోగిస్తారు. తీయని కలలతో మనసంత ఆనందిస్తోంది.

నిజంగా మనం కనే కలలన్నీ నిజమయ్యేటట్టయితే లోకం ఇంతకంటే మధురంగా ఎప్పుడో తయ్యారయ్యేది. దానికి ఎన్నో అడ్డంకులు! నూరు సంవత్సరాల పోరాటం తర్వాతగాని మన స్వాతంత్ర్యమే రాలేదు. దానికి ఎంతోమంది ప్రాణ త్యాగాలు చెయ్యాల్సి వొచ్చింది.

అకస్మాత్‌గా ఆయన మెదడులో ఏవో పాత జ్ఞాపకాలు మెదలసాగాయి. ఆయన ఎప్పుడు ఇలా ఉన్నత ఆశయాల్లో విహరిస్తూ వుంటే, ఆయన భార్యకి వాస్తవిక దృష్టి తప్ప మరేం లేదు. ఆయనకి ఇద్దరు పిల్లలు కూడా – ఒక పిల్లాడు, ఆడపిల్లాను.

ఆవిడ – ఆడది, పాపం, ఏం చేస్తుంది. ఎట్లాగో అట్లా సంసారాన్ని చక్కదిద్దుకొనిరావాలి. వాళ్లింట్లో ఏదీ లోటు లేకుండా వుండడం ఆవిడ కాపరానికి వచ్చినప్పటి నుంచీ ఎరగదు. అందరూ ఆవిడ భర్తని ఆరాధిస్తారు. ఆవిడా మనసులో గౌరవిస్తుంది కాని 'గొప్పతనం'తో కడుపు నిండుతుందా? స్వాతంత్ర్యం రాని అన్నాళ్ళు ఎంతో ఓపికతో గడిపింది. స్వాతంత్ర్యం వచ్చాక కష్టాలన్నీ గట్టు ఎక్కుతాయనుకుంది. త్యాగం గుర్తించబడి, ఏదో లాభం కలుగుతుందనుకుంది. కాని ఆ ఆశలు నిరాశలయ్యాయి. జీవితం మాములుగానే ఉంది. ఇంకా త్యాగం, "త్యాగం" అని అరుస్తూనే వున్నారు నాయకులు. తన భర్త "త్యాగబుద్ధికి" అంతం లేదు. పిల్లాడు ఏడవ తరగతిలోకి వాచ్చాడు. అమ్మాయి పెళ్ళి ఈడు కొచ్చింది.

కట్టుకునే బట్టలకీ, పిల్లల పుస్తకాలకీ, ఇంట్లో ఉప్పుకీ పప్పుకి ఎప్పుడూ దేవుళ్లాడుకోవడమే! ఆవిడ కన్నీరు కార్చని క్షణం లేదు. కాని భర్త ఇవేం గుర్తించడు.

నువ్వంతా స్వార్థంతో మాట్లాడుతున్నావు. మనం త్యాగం చేసేది ఇలాంటి క్షణికమైన సుఖాలకా పిచ్చిదానా? ప్రజలు తరతరాలు మన త్యాగ ఫలిత మనుభవిస్తారు. జ్ఞాపకముంచుకో! అంటాడు.

ఆవిడా విషాదకరంగా నవ్వుతుంది. కళ్ళల్లో ఓర్పులేని తనం, కోపం కూడా జ్వలిస్తాయి. ఇట్లా అనేది "మీకు పుణ్యముంటుంది – మీ త్యాగబుద్ధికి వేయి నమస్కారాలు. మీ త్యాగఫలితం ముందు తరాల వారనుభవించక్కర్లేదు. యెప్పుడో! ఇప్పుడు నేనూ మీ పిల్లలు అనుభవిస్తున్నాం." ఇలా అని చినిగిన పమిట కొంగుతో కళ్ళని అద్దుకుంటుంది. కూతురు దూరంగా కూరలు తరుగుతూ, అమాయకంగా వాళ్ళని చూస్తుంది. అలాంటి క్షణాల్లో శివరావుగారి క్కూడా ఏమీ తోచలేదు. ఏమీ అనలేడు; ఎవర్నీ నిందించలేడు. ఇలాంటి సంభాషణ ఆయన రెండు రోజులకి బయలుదేరుతాడనగా, ఉదయాన్నే జరిగింది. అయితే ఏం చెయ్యమంటావ్? అన్నాడు.

ఆవిడకి దుఃఖంలో కూడా నవ్వువచ్చింది? ఇదే తెలీని వాళ్ళు దేశాన్ని యింకేం ఉద్ధరిస్తారా. అనేమో!

"మీరు ఏమీ చెయ్యవద్దు. అదే నా కోరిక! ఏమీ చెయ్యకుండా వుంటేనే మీరు ఎంతో చేసినట్టు, మీ అమాయకత్వాన్ని ఇతరులు త్యాగం అనే పేరుతో దోచుకోకుండా వుంటే చాలు, అంతకంటే నాకేం అక్కర్లేదు" అంది.

శివరావుగారు ఆలోచనలో పడ్డాడు. తను నిజంగా అంత అమాయకుడా? నిజంగా తన్ను అందరూ మోసపుచ్చుతున్నారా? ప్రపంచకంలో స్వార్థ త్యాగానికి అర్థం లేదా?

"నీవుద్దేశంలో మానవుడి జీవితాశయం, ఎవళ్ళ కుటుంబపోషణ వాళ్ళు చేసుకుంటూ కుక్షింభరత్వంలో ఉండటమేనా? నా భార్యవై వుండి కూడా నీకు ఇలాంటి సంకుచితపు బుద్ధులెక్కడ్నించి వచ్చాయి? ఈ పదిహేడేళ్ళ జీవితంలో నా సాహచర్యంలో నేర్చుకున్నది ఇదేనా నువ్వు?" ఆయన కొంచెం కఠినంగానూ, కొంత పరీక్షగానూ అడిగాడు.

కాని ఆవిడ చలించలేదు. కారణం అసలు సంకుచితత్వం అనేది ఆవిడలో శూన్యం. అందుకని యిట్లా అంది. "మిమ్మల్ని సంకుచితమైన మనస్సు కలవాళ్ళుగా అవమని నేనన్నానా? కాని పిల్లల భవిష్యతూ, ప్రస్తుత సంసారం చూసుకోమన్నాను. అంతే! మీ రాజకీయాల్లో మీరు పడి వుంటారు. కాని ఇంట్లోని బాధని మీకెప్పుడూ చెప్పలేదు. ఈ వేళ ఇంట్లోకి బియ్యం లేవు. అబ్బాయి జీతానికి డబ్బులు లేవు. అమ్మాయి లెక్కలపుస్తకం కొనుక్కోవాలిట. రేపు మీ ప్రయాణానికి ఎవరో ఇస్తారనుకుందాం! మరి మా గతేం కాను?

మీరు తిరిగి వచ్చేవరకూ ఏం చెయ్యం ?" ఆవిడ చెంపల మీద నుండి అశ్రు బిందువులు కారాయి.

తర్వాత సంభాషణ ఆయనకి జ్ఞాపకం లేదు కాని ఆవిడకి తనంతతానే ఓదార్చుకునే శక్తి వుంది. కష్టాన్ని సులువుగా మర్చిపోగలదు. అందుకేనేమో ఇన్నేళ్ళ కష్టాన్నీ అట్లా భరించగలిగింది! లేక అది భారత స్త్రీలకి స్వతస్సిద్ధమైన నేర్పేమో! ఓ కుటుంబంలోని దారిద్ర్యమంతా ఆయనకి ఒక్కసారిగా కళ్ళకు కట్టినట్లయింది. ఆయన ఆ సంగతి ఎప్పుడూ ఆలోచించలేదు; గమనించలేదు కూడా. ఆయన అనుభవించిన కష్టాల ముందు, దరిద్రం లెక్కకు రానిది. పైగా ఆయన స్వంత విషయాల్లో ఆయన ఘనతని చూస్తే, పలుకుబడిని చూస్తే ముందు ఏదైనా లాభం ఉండకపోతుందా అని కొంతమంది ధనవంతులు సహాయం చేసేవారు. కాని కుటుంబాన్నంతా ఎవరని, ఎంత కాలమని పోషిస్తారు?

ఆయనకి భార్య మాటలు గుర్తుకొచ్చాయ్. అవును, ఈత్యాగానికి పరిమితి లేదా? ఎంతమంది తనలాగా బీదతనాన్ని ఆహ్వానించుకుని బాధపడుతున్నారో! ప్రతిఫలం ఎరుగని ఈ స్వార్థత్యాగానికి గుర్తింపనేది ఎప్పటికన్నా వుంటుందా?

బస్సు కొన్ని చోట్ల ఆగుతోంది; కొందరు ప్రయాణీకులు ఎక్కుతున్నారు; కొందరు దిగుతున్నారు, కొందరు ఆయనకి నమస్కరిస్తున్నారు. ఆయన ప్రతి నమస్కారం చేసి మళ్ళీ ఆలోచనలో పడసాగారు.

రాజకీయ జీవితాన్ని గడిపిన వాళ్లు రెండు రకాలుగా వుంటారు. కొందర్ని కీర్తికాంత వెంటనే వరిస్తుంది. వాళ్ల త్యాగం తక్షణం గుర్తించబడుతుంది. వాళ్ళ జీవితాలు ఉన్నత శిఖరాలు అందుకుంటాయి. వాళ్ళకి ఆర్థిక బాధలుండవు. వాళ్ళు త్యాగాన్ని గురించి ఎల్లకాలం ఉపన్యసించగలరు; జీవితాన్ని నిర్విచారంగా గడపగలరు. కాని రెండో తరగతికి చెందినవాళ్ళ త్యాగం అజ్ఞాతంగా ఉంటుంది. వాళ్ళు అంతపైకి రారు. కాగా వాళ్ళకి పేరు ప్రఖ్యాతుల మీద ఆసక్తి కూడా ఉండదు. వాళ్ళకి ఆర్థిక బాధలు చాలా ఉంటాయి. వాళ్ళ జీవితం దుర్భరంగా వుంటుంది.

శివరావుగారు రెండో తరగతికి చెందిన దేశ భక్తుడని వేరే చెప్పనక్కర్లేదు.

చదువుకొనే రోజుల నుండి ఆయనకు రాజకీయాలంటే ఎక్కువ ఆసక్తి ఉండేది.

గ్రంథాలయోద్యమంలోనూ, ఆంధ్రమహాసభలోనూ పాల్గొన్నారు.

1947లో స్టేట్ నుండి బహిష్కరింపబడటంలో ఆయన అందరి దృష్టిపథంలోనూ పడ్డారు. ఐనా దేశాభిమాని ఐన మూలాన, ఆ ఆజ్ఞను ధిక్కరించి రహస్యంగా ప్రజా పోరాటాల్లో పాల్గొని ఇక్కడ కూడా ప్రజా ప్రభుత్వాన్ని నెలకొల్పాలని తాపత్రయపడ్డారు.

త్వరలోనే పట్టుబడి నిర్భంధించబడ్డారు.

1948 లో "పోలీసుచర్య" అనంతరం ఆయన విడుదల పొందారు.

అప్పట్నించి స్వగ్రామం వెళ్లి, దేశసేవ చేస్తున్నాడు. ఎలక్షన్ ప్రచారంలో ఆయన చేసిన సేవ అపారం.

"దేశానికి రాజకీయ స్వాతంత్ర్యమే కాదు కావల్సింది. ప్రజల ఆర్థిక దాస్యం, అజ్ఞాన తిమిరాలు తొలగాలి. నవ్యభారత జాతి నవనవోజ్వల కాంతులతో విలసిల్లాలి. అందుకే ప్రజలంతా ప్రజాప్రభుత్వానికి తోడ్పడాలి." అనేది ఆయన నినాదం. ఆయన్నందరూ "పదవీ వ్యామోహం లేని త్యాగి" అంటారు.

ఆయన తనగాథంతా గుర్తుకు తెచ్చుకొని, ఏవో ఆలోచించుకుంటున్నాడు.

బస్సు నార్కెట్‌పల్లిలో ఆగింది. అక్కడో మిత్రుడు ఆయనకు కలిశాడు.

"నమస్కారమండి!"

"నమస్తే"

"హైదరాబాదేనా?"

"అవును"

"సాంఘిక సేవా సమితి మీటింగుకేనా?"

"కాదండి" అన్నాడాయన. శివరావుగారి మనస్సు చివుక్కుమంది. ఆయనతో మాట్లాడిన వ్యక్తి కూడా చాలా దేశసేవ చేసినవాడు. కాని ఈవేళ ఆయనలో ఈ మార్పెందుకు వచ్చింది? అది శివరావుగారికి అర్థం కాలేదు.

"ఎందుకని?"

"నేను రాజకీయాల్లో నుండి విరమించుకొన్నాను. కుటుంబపోషణకోసమని చిన్న వ్యాపారం పెట్టుకున్నాను. దాని పనిమీద వెడుతున్నాను."

శివరావుగారి మీద పిడుగుపడినట్లైంది! తనలానే ఆర్థికంగా బాధపడే రాజకీయ బాధితులు ఎంతోమంది వున్నారన్నమాట! వాళ్లు నెమ్మదిగా గతిలేక రాజకీయ రంగాన్ని, ప్రజాసేవనీ వొదలవల్సివస్తోంది. ఎంత దురవస్థ!

ఇద్దరూ టీ తాగి బస్సులో కూర్చున్నారు. బస్సు మళ్ళీ బయలుదేరింది మహావేగంతోను, అది ఎక్స్‌ప్రెస్ బస్సు. అంత వేగంతోను, ఆయన ఆలోచనలు పరుగెడుతున్నాయి.

"అంటే మీ ఆర్థికబాధే ఇలా చేసిందన్నమాట" అన్నారు శివరావుగారు, పక్కన కూచున్నాయనతో.

ఆయన తలవంచుకున్నాడు. "చూడండి; మాది పెద్ద కుటుంబం. వాళ్ళ జీవనభృతికి ప్రజల మీద ఎంత కాలమని ఆధారపడుతాం?" అన్నాడు సంకోచిస్తూ.

శివరావుగారిదివరకు ఇతర రాజకీయ పార్టీల్లో వర్కర్లకి కొంత ద్రవ్య సహాయం పార్టీలిస్తాయని విన్నాను. అది విన్నప్పుడు ఆయనకి ఆశ్చర్యం, జాలీ కలిగాయి. వాళ్ళందరూ అమ్ముడుపోయినట్టు అనుకునేవాడు. కానీ ఇప్పుడు ఆలోచిస్తొంటే అదే సరైనదేమో అనిపిస్తోంది.

'ఇన్నాళ్లూ మనకి స్వాతంత్ర్యం లక్ష్యమైంది. ఇప్పుడు మనం దాన్ని చేరుకున్నాం. కాని స్వాతంత్ర్యం అంటే అర్థం ఎంతమందికి తెల్సింది? స్వాతంత్ర్యపు విలువని ఎంతమంది గ్రహించారు?

ఇప్పుడు మనం దేశ ప్రజల జీవనస్థితిని పైకి లేవనెత్తడానికి ప్రయత్నించాలి. వాళ్ళల్లో ఉన్న అజ్ఞానాన్ని, నిరక్ష్యరాస్యతనీ, మూఢ నమ్మకాల్నీ మనం పోగొట్టాలి. వీటి కోసరం ఇంకా ఎంతో మంది వీరులు ఆత్మార్పణ లివ్వాలి. ఎంతోమంది త్యాగులు దేశానికి అవసరం.

అంతేకాదు. దేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి. వ్యవసాయక సంస్కరణల్ని తేవాలి. రైతులు కూడా నాగరికత విలువల్ని గ్రహించేలా చెయ్యాలి. ఒక్కమాటలో చెప్పాలంటే అందరికి తిండీ, బట్టా, నిలువనీడా, తీరికా వుండేలా చెయ్యాలి. అదే మన నూతన లక్ష్యమవ్వాలి.

ఏవేవో భావతరంగాలు ఆయన ఊహాసముద్రంలో కదులుతున్నాయి.

ఆయన మిత్రుడడిగాడు. "మీరు హైదరాబాద్ దేనికి?"

శివరావు ఇదే తెలీదా అన్నట్లూ చూసి ఇలా అన్నాడు. "సాంఘిక సేవా సమితి సమావేశం జరుగుతోంది. మన సంస్థానంలోని కార్యక్రమాన్ని నిర్ణయించుకుందుకు అందరం కలుసుకుంటున్నాం. మీకు రాలేదూ, ఆహ్వానం?"

"అవును, వొచ్చింది! కాని నేను రాజకీయాల నుండి తొలగాలనుకుంటున్నాను. అందుకని రాదల్చుకోలేదు. ఈ అనంతమైన వెట్టి చాకిరీలో రక్తమాంసాల్ని కరిగించుకోలేను."

శివరావుకి జాలివేసింది 'పాపం' అనుకున్నాడు. ఆయన భార్య కూడ తన భార్య లాంటిది కాదు కదా! మళ్ళీ తన భార్య దీనమైన మొహం ఎదురైంది! ఆయన భావాలన్నీ పటాపంచలయ్యాయి. ఈ 'త్యాగానికి అంతం ఎక్కడ?' భార్య నిలదీసి ప్రశ్నిస్తున్నట్టుంది.

ఆయనలో అంతఃకలహం ఆరంభమైంది. ద్వివిధాలైన భావాల మధ్య దేశసేవ పేరుతో ఇలా దారిద్రంతో గడపడమా ? లేక తనూ తక్కిన ప్రజల్లా జీవనోపాధిని, కుటుంబ భవిష్యత్తును చూసుకోవడమా? ఏదీ నిర్ణయించలేకపోయాడు.

రేపు తప్పకుండా ఆయన ఆ దేశభక్తుల సమావేశంలో పాల్గొంటారు. అందరు నాయకులు అన్ని రకాల తీర్మానాలు ప్రవేశపెడతారు. అన్నీ తనూ సమర్థిస్తాడు. కార్యక్రమం అంతా నిర్ణయించుకుంటారు. కాని తను చివర్న అధ్యక్షుని అనుమతితో ఈ తీర్మానం పెడతాడు.

"దేశం కోసం త్యాగం చేసిన దేశభక్తుల గత చరిత్రను బట్టి, వాళ్లకి జీవనభృతి క్రింద చందాలు వసూలు చేసి, నెలకు వంద రూపాయలు ఇవ్వాలని ఈ సమావేశం తీర్మానిస్తోంది.

ఆయన అది చదవగానే సభలో కోలాహలం బయలుదేరుతుంది. కొందరు సమర్థిస్తారు. కొందరు దాన్ని వ్యతిరేకిస్తారు. ఎక్కువ మంది ఆయన్ని గర్హిస్తారు. ఆయనలో స్వార్థపరత్వం

పెరిగింది అంటారు. సభావేదిక నుండి కిందికి తోసేస్తారు. కాని ఆయన తన వాదన మానడు. ఎంతో ఉద్రేకంలో ఇలా ఉపన్యసిస్తాడు.

"సోదరులారా, మేమూ మీలా దేశసేవ చేసినవాళ్ళమే. మా త్యాగాన్ని మేం చెప్పదలచుకోలేదు. దేశమే గుర్తిస్తుంది. మీరు 'త్యాగం' చెయ్యండని అరుస్తారు. సంఘ సేవ చెయ్యమంటారు. ప్రజాసేవ చెయ్యాలి. కాని ఇంట్లో గంజి క్కూడా దిక్కులేని స్థితిలో మేం ఏం చెయ్యగలం ?"

ఉద్రేకంతో కింద పడిపోతాడు. జనం ఆయన్ని లెక్కచేయ్యకుండా పోతుంటారు...!

అవును, జనం పోతున్నారు. బాగా చీకటి పడింది. బస్సు పట్నంలో ప్రవేశించి పుతిలీబ్‌లీ దగ్గర ఆగింది. అందరూ దిగుతున్నారు. కాని ఆయన మాత్రం లేవలేదు.

కండక్టరొచ్చి చెప్పాడు. "సాబ్, ఉతర్నా హై!"

"వొచ్చానూ? హైదరాబాద్, వొచ్చానూ" అంటూ ఆయన లేచాడు సంచీ చేత్తో తీసుకొని ఆలోచనల్నించి మేల్కొంటూ.

*"కథావాహిని" కథల ఏడవ సంపుటి నుండి.*